ప్రజాశక్తి

ఆదివారం 27 ఏప్రిల్ 2025

5

విజయనగరం

ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలో ఉపాధి పథకంలో పనిచేస్తున్న ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లను పీడీ శారదాదేవి సస్పెండ్ చేశారు. మూడు రోజుల క్రిందట సస్పెండ్ చేసినప్పటికీ బయటకు తెలియనీకుండా జాగ్రత్త పడడం విశేషం. మండలంలోని కౌలువాడ ఫీల్డ్ అసిస్టెంట్ చెల్లుబోయిన నర్సింగరావు, పోలిపల్లికి చెందిన బుగత శ్రీనివాసరావు, లింగలవలస ఫీల్డ్ అసిస్టెంట్ కొల్లి సూర్యకలను సస్పెండ్ చేశారు. మండలంలో ఇటీవలి జరిగిన సామాజిక తనిఖీల్లో అవినీతి పాల్పడినట్లు బయటపడిందని అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల వారికి షోకాజ్ నోటీస్‌లు కూడా జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. విచారణ అనంతరం వీరిని సస్పెండ్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

నగరంలోని ఒకే ఒక్క ప్రభుత్వ జూనియర్ కళాశాల

పది తరువాత 'ప్రయివేటు'కే!

- ప్రభుత్వ కళాశాలలకు నోచుకోని విద్యల నగరం
- ఫీజులు చెల్లించలేక చదువు ఆపేస్తున్న పేద విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా కేంద్రంలో మూడు మున్సిపల్ హైస్కూళ్లు, మండల పరిధిలో సుమారు 12 వరకు జెడ్‌పి ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఏడాదికి వెయ్యి మంది విద్యార్థులకు పైగా ఇంటర్‌కు వస్తున్నారు. దీన్ని బట్టి కనీసం నాలుగు ఐదు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు అవసరం ఉంది. కానీ జిల్లా కేంద్రంలో ఒకే ఒక్క జూనియర్, డిగ్రీ కళాశాలలు ఉండడం, అందులోనూ అధ్యాపకులు లేక, సౌకర్యాలు లేక పోవడంతో విద్యార్థులు వాటిలో చేరేందుకు ముందుకు రావడం లేదు. వీరంతా పేద విద్యార్థులు కావడంతో వేలల్లో ఫీజులు కట్టి ప్రైవేటు కళాశాలల్లో చేరేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఇంటర్, డిగ్రీ కళాశాలు ప్రభుత్వం ఏర్పాటు చేస్తే వేలాది మంది విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లేందుకు అవకాశం ఏర్పడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

గతంలో ఎయిడెడ్ వ్యవస్థ రద్దుతో ఆయా కళాశాలల్లో పనిచేసే టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ప్రభుత్వ కళాశాలల్లో చేరిపోయారు. దీంతో వ్యాపారమే లక్ష్యంగా ఎంఆర్ కళాశాల యాజమాన్యం వ్యవహరిస్తోందనే విమర్శలు న్నాయి. చివరకు ఏకైక మహిళ ఎంఆర్ కళాశాలలో కూడా అధిక ఫీజులు చెల్లించుకొని ఇంటర్, డిగ్రీ, ఆ పైన చదువులన్నీ ప్రైవేటులో సాగాల్సిందే. దీంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థులు పదో తరగతి వరకు చదువుకుని ఆ తరువాత చదువుకు పుల్‌స్టాప్ పెడుతున్నారు. ఆర్థికంగా ఇబ్బంది లేని వారు ఇక్కడి ప్రైవేటు కళాశాలల్లో లేదా ఇతర పట్టణాల్లోని కళాశాలల్లో తమతమ పిల్లలను చదివించుకుంటున్నారు. జిల్లా కేంద్రంగా ఇంటర్, డిగ్రీతో పాటు పీజీ కళాశాలలు ప్రభుత్వ పరంగా అందుబాటులో ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది.

విజయనగరంలో గత ప్రభుత్వంలో డిగ్రీ కళాశాల మంజూరైంది. కానీ భవనాలు లేక ,అధ్యాపకులు లేక కళాశాల అనేక సమస్యలతో నడుస్తుంది. ప్రైవేటు కళాశాలలకు వత్తాసు పలుకుతూ ప్రభుత్వ విద్యారంగం పట్ల ప్రభుత్వానికి, పాలకులకు ఎంత నిర్లక్ష్యం ఉందో దీనిని బట్టి అర్థం అవుతుంది. ప్రస్తుత 2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్‌తో పాటు డిగ్రీ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేస్తే ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసు కోవాలని విద్యార్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యల నగరంగా పేరొందిన విజయనగరంలో ప్రభుత్వ విద్య ఉత్తిమాటగానే మిగులుతోంది. పదోతరగతి తర్వాత ఎవరైనా ఇక్కడ ఉన్నత చదువులు కొనుక్కోవాల్సిందే తప్ప చదువుకునేందుకు అవకాశం లేకుండా పోతోంది. ప్రభుత్వ కళాశాలలు లేకపోవడంతో ప్రైవేటు కళాశాలలే దిక్కవుతున్నాయి. దీంతో పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుకు దూరమయ్యే దుస్థితి నెలకుంటోంది. జిల్లా కేంద్రం పట్టణ స్థాయి నుంచి నగర స్థాయికి ఎదిగినా ప్రభుత్వ విద్యారంగంలో మాత్రం పురోగతి లేదు. ఈ విషయంలో పాలకుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

మా గ్రామంలోకి రావద్దు

రెవెన్యూ సిబ్బందిని అడ్డుకున్న గిరిజనులు

ప్రజాశక్తి-వేపాడ

రెవెన్యూ అధికారులు, సిబ్బందిని మండలంలోని మారిక గ్రామానికి రాకుండా సిపిఎం ఆధ్వర్యాన గిరిజనులు అడ్డుకున్నారు. మారిక భూములను అదానీ కంపెనీకి కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం తమ గ్రామంలోకి వారిని రాకుండా కొత్తగా నిర్మిస్తున్న రహదారిపైనే అడ్డగించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు చల్లా జగన్ మాట్లాడుతూ గిరిజనుల పక్షాన కాకుండా అదానీ సేవలో రెవెన్యూ సిబ్బంది మునిగితేలడం అన్యాయమన్నారు. ప్రభుత్వంపై ఆధారపడకుండా పచ్చని కొండపై జీవిస్తూ, ఇప్పుడిప్పుడే సౌకర్యాలు పొందుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో 'గ్రామం మొత్తాన్ని అదానీకి రాసిచ్చాం.. ఇక్కడి నుంచి పొండి' అంటే గిరిజనుల బతుకులు ఏమవ్వాలని ప్రశ్నించారు. అమాయక గిరిజనులను రోడ్డున పడేయాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. అదానీ పవర్ ప్లాంట్‌కు భూములిచ్చే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. డిప్యూటీ తహశీల్దార్ సన్యాసినాయుడు, ఆర్ఐ రాపులక్ష్మి మాట్లాడుతూ గిరిజనుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. అనంతరం అక్కడి నుంచి వెనుదిరిగారు. కార్యక్రమంలో గిరిజనులు గమ్మెల అప్పలనాయుడు, గమ్మెల శ్రీను, కిలో అర్జున్, గమ్మెల శోభన్‌బాబు, జమ్మల బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామానికి రాకుండా రెవెన్యూ సిబ్బందిని అడ్డుకుంటున్న సిపిఎం నాయకులు, మారిక గిరిజనులు

పాకిస్తానీయులు స్వదేశానికి వెళ్లాలి

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం

పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పాకిస్థాన్‌పై అనేక ఆంక్షలు విధించిన నేపథ్యంలో భాగంగా దేశంలో ఉన్న పాకిస్థానీయులంతా ఈనెలాఖరుకల్లా తిరిగి పంపించేయాలని నిర్ణయిం కేంద్ర ప్రభుత్వం తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ హోం శాఖ జారీ చేసిన ఉత్తర్వుల అమలులో భాగంగా విజయనగరం జిల్లా పరిధిలో ఉన్న పాకిస్థానీయులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ డివిజనల్ అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం పాకిస్థానీలకు ఇచ్చిన వీసాలను రద్దు చేసిన నేపథ్యంలో సాధారణ వీసాలపై వచ్చిన పాకిస్థానీయులు ఏప్రియల్ 27 కల్లా, వైద్య వీసాలపై వచ్చినవారు ఏప్రియల్ 29 కల్లా దేశం విడిచి వెళ్లాలని స్పష్టం చేశారు. ఈ నెల 30 తర్వాత అట్టారీ సరిహద్దును మూసివేస్తున్న దృష్ట్యా జిల్లాలో పాకిస్థాన్ వీసాపై వచ్చిన వారిని గుర్తించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఓలను ఆదేశించారు.

కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉగ్ర దాడిని ఖండిస్తూ..

యుటిఎఫ్ కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన శనివారం రాత్రి నగరంలోని జిల్లా పరిషత్తు కార్యాలయం వద్ద కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో పాల్గొన్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉగ్రవాద చర్యలను తీవ్రంగా ఖండించారు. మతాల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టడానికి ఉగ్రవాదులు జరిపే చర్యను తిప్పికొట్టాలని, భారత దేశంలో మతసామరస్యం కాపాడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి మోహన్‌రావు, జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి జెవివిఆర్‌కె ఈశ్వరరావు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు జెఆర్‌సి పట్నాయక్, జిల్లా కోశాధికారి భాస్కరరావు, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, జివి రమణ, సిహెచ్ తిరుపతి నాయుడు, రాజారావు, శంకర్రావు, రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి : తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ డి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ హరికృష్ణ, పలువురు విఆర్ఓలు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - సంతకవిటి

దళితులను పనులకు, శుభకార్యాలకు రాకుండా బహిష్కరించిన పెత్తందారులపై ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండలంలోని పోతురాజుపేట గ్రామంలో దళితులను కలిసి, పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు సంబంధించిన స్థలాన్ని పెత్తందారులు ఆక్రమించుకొని బేరానికి పెట్టడాన్ని దళితులు అడ్డుకున్నారని ఆయన తెలిపారు. దీంతో దళితులు దుంగ (శ్రీరాములు, దుంగ గద్దెమ్మ, దుంగ దాలయ్యను పనులకు, శుభకార్యాలకు బహిష్కరణకు గురిచేస్తే అధికారులు పెత్తందారులపై చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఎస్సి నియోజకవర్గంలోనే దళితులకు రక్షణ లేక పోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా పెత్తందారులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి వారిని శిక్షించాలని డిమాండ్‌చేశారు. దళితులు అంబేద్కర్ విగ్రహం పెట్టుకునేందుకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

యువసమ్మేళనంలో డిఆర్‌డిఒ మాజీ చైర్మన్ జి.సతీష్ రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరంకోట

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని డిఆర్‌డిఒ మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ రక్షణ సంస్థ సలహాదారు జి.సతీష్‌రెడ్డి సూచించారు. కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్, చేయూత ఫౌండేషన్ సంయుక్తంగా నగరంలోని ఎస్‌వివిఎన్ నగర్‌లో ఉన్న సుజాత కన్వెన్షన్‌లో శనివారం యువసమ్మేళనం ఏర్పాటు చేశాయి. రక్షణ శాస్త్ర, సాంకేతిక, స్పేస్ రంగాల్లో ఇంజనీరింగు విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రపంచంలోని ఇతర దేశాల కంటే ముందుందని చెప్పారు. యువత అవకాశాలను అందిపుచ్చుకొని, భారత రక్షణ రంగాన్ని బలోపేతం చేయాలన్నారు. దేశంలో ప్రతిభకు కొదవలేదని, చాలామంది యువకులు మారుమూల పల్లెల నుంచి వచ్చి, ఎటువంటి అండా లేకున్నా, ఉన్నతమైన ప్రతిభ, ఆలోచనలతో ఎంతో ఎత్తుకు ఎదిగారని గుర్తుచేసి, యువతలో స్ఫూర్తినింపారు.

ఎస్‌పి వకుల్ జిందల్ మాట్లాడుతూ విద్యార్థులు ఒకసారి డ్రగ్స్ వినియోగిస్తే ఏమీ కాదన్న భ్రమలో ఉంటారని తెలిపారు. డ్రగ్స్ వినియోగించడం ప్రారంభిస్తే వారికి తెలియకుండానే బానిసలుగా మారుతారన్న వాస్తవాన్ని ప్రతిఒక్కరూ గ్రహించాలని కోరారు. డ్రగ్స్‌కు బానిసలుగా మారిన యువతకు, వారి చెడు అలవాట్లకు సరిపడే డబ్బులు లేక చిన్నచిన్న దొంగతనాలకు పాల్పడి దురదృష్టవశాత్తూ నేరస్తులుగా మారుతున్నారన్నారు. హత్యా నేరానికి పాల్పడిన వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష.. 14 ఏళ్ల జైలుశిక్ష విధిస్తే, గంజాయి కేసుల్లో నిందితులుగా పట్టుబడిన వారికి 20 ఏళ్ల వరకు జైలు శిక్షను న్యాయ స్థానాలు విధిస్తున్నాయని చెప్పారు. దీన్నిబట్టి గంజాయి అక్రమ రవాణా, వినియోగం, విక్రయాలు ఎంతటి తీవ్రమైన నేరమోనన్న విషయాన్ని యువత గుర్తించాలన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా ఉండాలన్నారు. ఒకవేళ అలవాటు పడిన వారెవరైనా ఉంటే ఎటువంటి సంకోచమూ లేకుండా డి-అడిక్షన్ సెంటరులో ప్రాథమిక స్థాయిలో చికిత్స పొందితే, వాటి నుండి బయట పడవచ్చునని తెలిపారు.

యువసమ్మేళనంలో మాట్లాడుతున్న డిఆర్‌డిఒ మాజీ చైర్మన్ జి.సతీష్ రెడ్డి

మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్

వివిధ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణలను సతీష్ రెడ్డి పరిశీలించారు. వాటి పనితీరు, ప్రాశస్త్యం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించేందుకు విద్యార్థులు సందేహాలను వ్యక్తపర్చి, సలహాలు కోరగా, వారి సందేహాలను నివృత్తి చేశారు.

ఈ కార్యక్రమంలో ఎమ్‌డి. కలియల్లా షరీఫ్, ఆర్‌డిఒ దాట్ల కీర్తి, స్టేట్ కో-ఆర్డినేటరు రవిచంద్ర రెడ్డి, చేయూత ఫౌండేషన్ అధ్యక్షులు ఎం.రాము, ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు వి.సత్యనారాయణ, లెండి, సీతం, రఘు ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్య ప్రముఖులు, ప్రొఫెసర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం తల్లిదండ్రుల దారుణహత్య

కన్నకొడుకే కాలయముడయ్యాడు. ఆస్తి కోసం తల్లిదండ్రులను ట్రాక్టర్‌తో తొక్కించి దారుణంగా హత్య చేశాడు. సోదరికి ఆస్తిలో వాటా రాసిచ్చారనే అక్కసుతో ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. ఈ విషాదకర సంఘటన పూసపాటిరేగ మండలం చల్లవానితోట పంచాయతీలో చోటుచేసుకుంది. (పూర్తి కథనం మెయిన్‌లో)

పింఛన్ల బదిలీ తప్ప కొత్త పెన్షన్ ఇవ్వడం లేదు

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కూటమి ప్రభుత్వం పాత పెన్షన్లు బదిలీ చేస్తున్నది తప్ప కొత్త పెన్షనలు ఇవ్వడం లేదని, ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు మాటలు ఉన్నాయని జెడ్‌పి చైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జెడ్‌పి కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కొత్త పెన్షనులు ఇస్తున్నామని మంత్రి గొప్పలు చెబుతున్నారని,భర్త చనిపోతే ఆ భర్త తాలూకా పెన్షన్ భార్యకు బదిలీ చేస్తున్నారే తప్ప కొత్తగా పెన్షన్లు ఇవ్వడం లేదని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి అన్ని సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించి పథకాలు అందించే వారమని తెలిపారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా ఒక్క పథకం కూడా అమలు కావడం లేదన్నారు. ఎన్నికల హామీలో భాగంగా మత్స్యకారులకు వేట నిషేధం సమయంలో గత ప్రభుత్వం పదివేల రూపాయలు ఇచ్చే దాన్ని రూ.20వేలు చేస్తానని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి గత ఏడాది రూ.20వేలు కలిపి రూ.40వేలు చెల్లించాలని అన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి సరాసరి వేతనం పెరగాలి

సీజన్ వారీగా పనులకు ప్రాధాన్యత నివ్వాలి : కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం

ఉపాధి వేతనదారులకు దినసరి వేతనం పెరిగేలా పనులు చేయించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉపాధి పనుల తీరు, వేతనదారులు అందుకుంటున్న సగటు వేతనంపై సమీక్షించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఎండ తీవ్రతలేని సమయంలో పనులు నిర్వహించాలని చెప్పారు. ఉదయాన్నే వీలైనంత వేగంగా పని మొదలయ్యేలా చూడాలన్నారు. రెండుపూటలా కనీసం 6 గంటలు పనులు చేయించాలని ఆదేశించారు. వేతనదారులు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలని, తాగునీరు, నీడ ఏర్పాటు చేయాలని సూచించారు. పనిని పెంచి గరిష్ఠ వేతనం అందుకునేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. సీజన్ వారీగా ప్రాధాన్యతలను గుర్తించి ఉపాధి పనులలో అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు వేసుకోవాలని ఆదేశించారు. జలవనరులను పెంచే ఫార్మ్ పాండ్స్, పూడిక తీతలు, మరమ్మత్తులకు మే నెలలో ప్రాధాన్యత నిచ్చి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ప్రతి వారం గ్రామం వారీగా లక్ష్యాలను నిర్దేశించుకొని పనులు పూర్తి చేయాలన్నారు. ఫార్మ్ పాండ్స్ లక్ష్యాలను వర్షాకాలం లోపలే పూర్తి చేస్తే భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. పురోగతి లేని వారిని తొలగించడానికి వెనుకాడబోనని స్పష్టం చేశారు. ఎపిఒలు, ఎంపిడిఒలు సమన్వయంతో పని చేసి లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డ్వామా పీడీ శారదాదేవి, ఎపిఒలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బీమా

ఉపాధి వేతనదారులు దురదృష్టవశాత్తు మరణించినా, ప్రమాదం కారణంగా వైకల్యం సంభవించిన బీమా రక్షణ అందించే రెండు పథకాలు అమలులో ఉన్నట్లు డ్వామా పీడీ శారదా దేవి ఒక ప్రకటన లో తెలిపారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద 18 నుండి 70 సంవత్సరాల మధ్య వయసు ఉన్న వేతనదారులు 20 రూపాయల ప్రీమియం ప్రతి సంవత్సరం చెల్లించాలని తెలిపారు. ఈ పథకం కింద ప్రమాదవశాత్తూ మరణించిన లేదా పూర్తి వైకల్యం కలిగిన వారికి 2 లక్షల రూపాయల పరిహారం అందుతుందని తెలిపారు. పాక్షికంగా వైకల్యం పొందిన వారికి లక్ష రూపాయలు పొందగలరని తెలిపారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన క్రింద 18 నుండి 50 సంవత్సరాల మధ్య వయసు వారు రూ.436 ప్రీమియం ప్రతి ఏడాది చెల్లిస్తే వారి వారసులకు రూ.2లక్షలు పరిహారం అందుతుందని పేర్కొన్నారు. బీమా కోసం పోస్ట్ ఆఫీస్ లేదా బాంక్ లో ఖాతా నమోదు చేసుకోవాలని, వారి ఆధార్ ను అనుసంధానం చేయించాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9849903737 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

నిధులివ్వమంటే నోరెళ్లబెట్టారట!

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'గాదెలోని గింజలు గాదెలోనే ఉండాలట... గుంటడు మాత్రం గారకాయలా ఉండాలట'. ఉత్తరాంధ్రలోని ఈ తెలుగు సామెత ఇటీవల మన జిల్లాకు వచ్చిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడి తీరుకు, ప్రభుత్వ ఉదాసీనతకు అద్దం పడుతోంది. ఈనెల 21న ఈ అమాత్యులవారు జిల్లాలోని రామతీర్థసాగర్ ప్రాజెక్టు పరిశీలనకు రావడం, అదే రోజు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టు పనులపై సమీక్షా సమావేశం నిర్వహించడం విధితమే. జిల్లానే కాదు యావత్తు ఉత్తరాంధ్రానే సస్యశ్యామలం చేస్తామంటూ అధికార యంత్రాంగాన్ని, రైతాంగాన్ని ఊహల పల్లకిలో ఊరేగించేందుకు ప్రయత్నించారు. కానీ, అందుకు అవసరమైన నిధులు గురించి ప్రస్తావించిన అధికారుల వద్ద... అబ్బా.. అంతవుతుందా? అంతెందుకు... అంటూ పిసనారి లెక్కలు వేశారట. ఇప్పుడిదే జిల్లాలో పబ్లిక్ టాక్‌గా మారిపోయింది. అసలు సాగు నీటికోసం దశాబ్దాల తరబడి రైతులు ఎదురు చూస్తున్నారు. ఈనేపథ్యంలో పది నెలల క్రితం ఏర్పడిన కూటమి ప్రభుత్వం సాగునీటి కోసం ఏ సాయమైనా చేయకపోతుందా? అని ఎదురు చూడడం సహజమే. అమాత్యులవారు మాత్రం పాత సీసాలో కొత్త సారా అన్నట్టుగా డైలాగులు కొత్తగా వల్లెవేసినప్పటికీ, ఆ హామీలు మాత్రం పాతవేనని జనం చర్చించుకుంటున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు సుమా..! జిల్లాలోని ప్రాజెక్టుల పరిస్థితి, భూ సేకవరణ, పునరావాసం, నష్టపరిహారం తదితర అవసరాల ఆధారంగా అవసరమైన నిధుల కోసం రెండు నెలల క్రితమే అంటే రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు ముందు తారకరామ, తోటపల్లి ప్రాజెక్టు అధికారులు స్పష్టమైన నివేదిక పంపారు. ఇరిగేషన్ రెగ్యులర్ ఇఎస్ కార్యాలయం నుంచి కూడా ప్రస్తుతం ఉన్న

ప్రతిపాదలనకు అనుగుణంగా అవసరమైన నిధుల కోసం ఫైలు రాష్ట్ర కేంద్రానికి వెళ్లింది. వీటి ప్రకారం అప్పట్లో నిధులు కేటాయించలేదు. రామతీర్థసాగర్ నిర్మాణాల కోసం 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.807.55కోట్లు అవసరం కానున్నట్లు అధికారులు ప్రతిపాదనలు రూపొందించగా, ప్రభుత్వం కేవలం రూ.64కోట్లు మాత్రమే కేటాయించింది. తోటపల్లి ప్రాజెక్టు పూర్తికి రూ.519.11కోట్లు అవసరం కానున్నట్లు కోరగా ఆచరణలో రూ.47.81 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇక ఇతర ఆండ్ర, పెద్దగెడ్డ, తాటిపూడి తదితర జలాశయాలు, సాగునీటి కాలువల అభివృద్ధి కోసమూ అంతంతమాత్రమే కేటాయింపులు ఉన్నాయి. తాజాగా వచ్చిన జిల్లాకు వచ్చిన జలవనరుల అమాత్యులు ఉత్తరాంధ్రలోని సాగునీటి ప్రాజెక్టులకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తొలిపలుకులు పలకడంతో సాక్షాత్తు అధికార యంత్రాంగం కూడా సంబరపడింది. తీరా రెడ్డొచ్చే మొదలెట్టు అన్నట్టు నిధులు ఎంతెంత కావాలని అడుగుతునే ఆహా అంత అవుతుందా? అయితే సిఎం గారి దృష్టిలో పెడదాం అంటూ తిరుగుముఖం పట్టారు. నాగావళి నీటిని నాగావళి - చంపావతి ఇంటర్ లింకు చేయాలన్న మునుపు టిడిపి ప్రభుత్వం చేసిన ప్రతిపాదన గుర్తించి విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అశోక్ గజపతిరాజు అడిగిన ప్రశ్నకూడా అమాత్యులవారికి అర్థం కాలేదట. మొత్తానికి మంత్రిగారి పర్యటనలో నిధులపై స్పష్టత లేదని. సమావేశం ప్రాక్టికల్‌గా జరగలేదని పబ్లిక్ టాక్ వినిపిస్తోంది. దీంతో, మంత్రి పర్యటన కేవలం పార్టీని బలోపేతం చేసుకోవడానికే జరిగిందన్న అనుమానాలు కూడా వ్యక్తమౌతున్నాయి. చాలా మంది అధికారులతో మంత్రి మాట్లాడినప్పుడు మీ ఎమ్మెల్యేను కలిశావా? ఎందుకు ఇప్పటి వరకు కలవలేదు అన్న ప్రశ్నలకు ఇచ్చిన ప్రాధాన్యత జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల గురించి తెలుసుకునేందుకు ఇవ్వలేదు. ప్రభుత్వానికిగానీ, మంత్రిగారికిగానీ నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ఇప్పటికే ప్రభుత్వం వద్ద నిధులకు సంబంధించిన అధ్యయనం చేసి, వాటిపై ప్రభుత్వం అంతర్గతంగా చర్చించి ప్రజల్లోకి వచ్చే వారని కూడా చర్చ నడుస్తోంది.

ప్రజాశక్తి
www.prajasakti.com

కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి- డెంకాడ

పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా మండలంలోని పెద్దతాడివాడలో శనివారం టిడిపి నాయకులు కొవ్వొత్తు ర్యాలీ చేశారు. ముందుగా మానవహారం చేపట్టి కొవ్వొత్తుల్లు ర్యాలీ, నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు, మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, మాజీ పిఎసిఎస్ చైర్మన్ ప్రదీప్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి పతివాడ విద్యాసాగర్ నాయుడు, నియోజకవర్గ మహిళా అధ్యక్షులు చిల్లా పద్మ, రాష్ట్ర క్రిస్టియన్ సెల్ కార్యదర్శి చీకటి సుహాసిని, పెద్దతాడివాడ నాయకులు కోరాడ రమణ, బుగత రమణ, అబోతుల ఆదినారాయణ, కోరాడ రమేష్, సవరవిల్లి అప్పలనాయుడు, దిండి పెంటరాజు, పిళ్ళా సూరిబాబు, రౌతు పైడినాయుడు, కోన చంద్రరావు, అట్టాడ శ్రీను, సబ్బవరపు పైడి నాయుడు, బుజ్జి, బుర్లె రవికుమార్, సంజీవ్, సోమశేఖర్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత రహదారులకు మహర్దశ

ప్రజాశక్తి- రేగిడి

మండలంలో 9 బిటి రోడ్లకు రూ.7.55 కోట్లు మంజూరయ్యాయని, దీంతో బీటీ రోడ్లకు మహర్దశ పట్టిందని టిడిపి మండల నాయకులు దూబ ధర్మారావు, కిమిడి అశోక్ కుమార్ శనివారం అన్నారు. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ చొరవతో కొండవలసకు రూ.48 లక్షలు, సరసనాపల్లికి రూ.20 లక్షలు, సంకిలి రూ.1.56 కోట్లు, కోడిశ రూ.1.58 కోట్లు, కందిశకు రూ.62 లక్షలు, కోడిశకు మరో రూ.85 లక్షలు, అంబఖండి రూ.70 లక్షలు, కాగితాపల్లికి రూ.1.10 కోట్లు, దేవుదలకు రూ.46 లక్షలు మంజూరయ్యాయని అన్నారు. ఈ రోడ్లకు త్వరలో టెండర్లు ప్రక్రియ ఉంటుందన్నారు. వీరితోపాటు టిడిపి నాయకులు పాలూరు రామినాయుడు, పాలవలస రామచంద్రరావు, కోడిశ రమేష్ నాయుడు తదితరులు ఉన్నారు.

అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వ ఉపాధ్యాయులకు అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.సింహాచలం, బి.జోగినాయుడు డిమాండ్ చేశారు. బొబ్బిలి పట్టణంలో శనివారం వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులకు అంతర్ జిల్లాల బదిలీలు చేసి స్పోజ్ కేటగిరీలో ఎంటిఎస్ టీచర్లను పరిగణించాలన్నారు. 1998/2008 ఎంటిఎస్ టీచర్ల బదిలీలు కూడా రెగ్యులర్ టీచర్లతో చేయాలన్నారు. సింగిల్ టీచర్ పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా కాకుండా ఎంతమంది ఉన్న రెండో టీచర్‌ను నియమించాలని కోరారు.

ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- వంగర

విఆర్ఎల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని అ సంఘ నాయకుడు వై.అప్పలస్వామి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన వంగరలో శనివారం విలేకర్లతో మాట్లాడారు. 2015 ,2016 సంవత్సరంలో జిఒ 1307,1308 ఇస్తే గత ప్రభుత్వం ఆ జీవోలను రద్దుచేసి ఒక్కొక్క విఆర్ఎల దగ్గర పదివేల రూపాయలు రికవరీ చేసి పొట్టను పెట్టుకోందన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం ఎనిమిది నెలలు అయినప్పటికీ ఇంతవరకు హామీలు అమలు చేయకపోవడం చాలా దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పేస్కేల్ అమలు, అర్హులైన విఆర్ఎలకు పదోన్నతలు కల్పించాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ ఆఫీస్ వద్ద జరుగు ధర్నాలో అధిక సంఖ్యలో విఆంఎలు పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో విఆర్ఎలు రమేష్, దుర్గారావు, పైడితల్లి, లక్ష్ముము, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సిఐ చక్రవర్తి

మత్తులో జీవితాలను చిత్తు చేసుకోవద్దు

ఎక్సైజ్ సిఐ సిహెచ్ చక్రవర్తి

ప్రజాశక్తి - చీపురుపల్లి

మత్తు పానీయాలకు అలవాటు పడి ఏ ఒక్కరూ తమ జీవితాలను చిత్తు చేసుకోవద్దని చీపురుపల్లి ఎక్సైజ్ సిఐ సిహెచ్ చక్రవర్తి అన్నారు. శనివారం స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంగణంలో గల ఆటో స్టాండ్ వద్ద ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు, స్థానికులకు మత్తు పానీయాల అలవాటు వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలు నడుపుతున్న డ్రైవర్లు ప్రత్యేకించి మద్యం సేవించడం వల్ల వారి ఆరోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులు కూడా అధికమవుతాయని వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు సైతం ప్రమాదం బారిన పడే అవకాశాలు ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. మద్యం సేవించడం వల్ల వారి జీవితాలతో పాటు వారిపై ఆధారపడ్డ వారి జీవితాలు కూడా రోడ్డును పడే ప్రమాదం ఉందని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐ చక్రవర్తితో పాటు ఎస్ఐ గిరీష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షునిగా చెరుకూరి'

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ ట్రస్ట్ 'అమరజీవి పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి' జిల్లా అధ్యక్షులుగా ప్రముఖ వ్యాపారవేత్త చెరుకూరి నాగరాజును నియమించినట్లు వ్యవస్థాపక అధ్యక్షులు జి.వేణుగోపాల్ తెలిపారు. శనివారం చిన్న మధ్య తరహాశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో నాగరాజు కు నియామక పత్రాన్ని అందజేశారు. వ్యవస్థాపక అధ్యక్షులు వేణుగోపాల్ మాట్లాడుతూ చెన్నయ్ లో పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేసిన ఇల్లును మనరాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసి స్మృతి భవనంగా నిర్మాణం చేపట్టాలని, పొట్టి శ్రీరాములుకు భారతరత్న పురస్కారాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిమ్స్ రాజు, ఆరిశెట్టి సందీప్, పూసర్ల మోహన్, కాపుగంటి శ్రీనివాస్, సముద్రాల నాగరాజు, పూసర్ల సాయి, మామిడి రమేష్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రూ.600 వేతనమివ్వాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనదార్లకు 200 రోజులు పని కల్పించి, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శనివారం పూతికపేట మజ్జివానిబాయిలో జరుగుతున్న ఉపాది పనులను పరిశీలించి వేతనం వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేతనదార్లు 172 రూపాయలు మాత్రమే వేతనం వస్తుందని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికంగా వేతనం చెల్లింపులో జిల్లా ప్రథమ స్థానంలో ఉండేదని ప్రస్తుతం వేతనాలు రాకపోవడం అన్యాయమని అన్నారు. వేతనదార్లు మండుటెండలో పనిచేస్తున్నారని కనీసం ఏరియర్స్‌తో కలిపి 300 రూపాయలు వేతనం రాకపోతే ఎలా అని ప్రశ్నించారు. కనకల పద్మనాభం తదితరులు పాల్గొన్నారు

టిపిఆర్ఒ సింహాచలంపై సభ్యుల ఆగ్రహం

- పసుపు చొక్కా వేసుకుని పని చేయండి
- వెంటనే బదిలీ చేసుకుని వెళ్లిపోండి : ఫ్లోర్ లీడర్ రాజేష్ ఆగ్రహం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బిసి రుణాల విషయంలో కనీసం మేయర్‌కు, పాలక వర్గ సభ్యులకు చెప్పకుండా సంబంధం లేని వ్యక్తులకు విషయాలను చెప్పే అధికారం ఎవరిచ్చారని టిపిఆర్ఒ సింహాచలం, సిఎంఒ సన్యాసిరావుపై స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకవర్గాన్ని నిర్లక్ష్యం చేస్తూ పసుపు చొక్కాలు వేసుకున్న వారికి ప్రాధాన్యత ఇస్తూ తమకు చెప్పకుండా చేసే అధికారం ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. జగనన్న మార్ట్ కోసం వసూలు చేసిన రూ.27 లక్షలు డబ్బులు ఏమయ్యాయి? ఎందుకు ఇంతవరకు కమిషనర్ దృష్టికి తేలేదు, ఆడిట్ చేసే అధికారం సి ఎంఎంకు ఎవరిచ్చారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కమిషనర్ నల్లనయ్య కలుగజేసుకొని వాటి వివరాలు తెలుసుకొని సభ్యులకు తెలియజేస్తామని చెప్పడంతో వారంతా శాంతించారు.

మేయర్ వి.విజయలక్ష్మి అధ్యక్షతన శనివారం స్టాండింగ్ కమిటీ సమావేశం నగర పాలక సంస్థ కార్యాలయంలో జరిగింది. ఎజెండాలో అంశాలపై చర్చించే ముందు టిపిఆర్ఒ, సిఎంఎం తీరుపై చర్చను ప్రారంభించారు. అనంతరం అజెండాలో పొందుపరిచిన 35 అంశాలను చర్చించిన అనంతరం కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. కార్పొరేటర్ బాబు మాట్లాడుతూ ఎల్‌టిపిలు నగరంలో డాన్‌లు మాదిరి తయారయ్యారన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు పేరు చెప్పి 10 నుంచి 15 లక్షలు వసూలు చేస్తున్నారని తెలిపారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు రాజేష్ మాట్లాడుతూ ప్లాన్‌ల విషయంలో పెద్ద కుంభకోణం జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. కమిషనర్ నల్లనయ్య స్పందిస్తూ దీనిపై రాత పూర్వక ఫిర్యాదు ఇవ్వాలని సభ్యులను కోరారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు రాజేష్ మాట్లాడుతూ వాయిదా వేసిన అంశాలు ఎందుకు రావడం లేదని, జాగ్రత్తగా ఎజెండా ను తయారు చేయాలని సూచించారు. అనంతరం ఎజెండాలో వార్డు కార్పొరేటర్ పేర్లు ఎందుకు

అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్టాండింగ్ కమిటీ సభ్యులు రాజేష్

పేర్కొనడం లేదని ప్రశ్నించారు. చలివేంద్రాలకు వేసిన టెండర్లు రద్దు చేయాలని కమిటీ నిర్ణయించింది. వర్క్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేయాలని, వారి కాంట్రాక్టర్లకు అప్పులిచ్చేంతగా అడ్డగోలుగా సంపాదిస్తున్నారని, వారిపై దృష్టి పెట్టాలని సభ్యులు డిమాండ్ చేశారు. కులం పేరుతో ఎస్‌సి అధికారుల పట్ల వ్యవహరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, కమిషనర్ ఈ విధంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని,కార్పొరేటర్ రేగాన రూపవతి మేయర్‌కు ఫిర్యాదు చేశారు. విపణకల్ప షాపింగ్ ప్రాంతంలో మన స్థలాన్ని ఆక్రమించి షాపు కట్టారని, దానిపై సర్వే చేయించి స్థలాన్ని కాపాడాలని సభ్యులు రాజేష్ కోరారు. సమావేశం అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అన్ని డివిజన్లలో ప్రజల అవసరాలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చేపట్టిన ముందస్తు ప్రణాళికలు ఫలితాలనిస్తున్నాయని అన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ కె.అప్పలరాజు, స్టాండింగ్ కమిటీ సభ్యులు అల్లు చాణిక్య, జివి రంగారావు, రేగాన రూపాదేవి, సుంకరి నారాయణస్వామి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సర్పంచ్‌కు గౌరవం ఇదేనా?

శిలాఫలకంలో ప్రోటోకాల్ ఉల్లంఘన పై అభ్యంతరం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని ఉంగరాడ సచివాలయం ప్రారంభోత్సవం శిలాఫలకంలో సర్పంచ్, ఎంపిటిసి పేర్లు లేకపోవడం ప్రోటోకాల్ ఉల్లంఘించడం పట్ల అధికారులకు, పాలకులపై గుల్లపాడు సర్పంచ్ వియ్యపు లావణ్య అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం వండానపేటలో ప్రజాశక్తి ముందు తమ గోడును ఆమె వినిపించుకున్నారు. ఉంగరాడ గుల్లపాడు రెండు పంచాయతీలకు సంబంధించి సచివాలయం ఈ నెల 9న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ చేతులు మీదుగా ప్రారంభించినప్పటికీ ఆ శిలాఫలకంలో సర్పంచ్ లావణ్య, ఎంపిటిసి పిల్లల రోజా పేర్లు లేకపోవడం విడ్డూరమన్నారు. ప్రోటోకాల్ ప్రకారం ప్రభుత్వ కార్యకలాపాలు, సమావేశాలు, ప్రారంభోత్సవాలు, ఇతర కార్యక్రమాలకు స్థానిక ప్రజా ప్రతినిధుల ప్రోటోకాల్ తప్పనిసరి అన్నారు. మహిళ ప్రజా ప్రతినిధులను ఈ విధంగా టిడిపి నాయకులు అవమాన పరచడం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులకు పదవులు శాశ్వతం కాదని అన్నారు. పార్టీలు ఏవైనా ప్రజలచే ఎన్నుకోబడిన స్థానిక ప్రజా ప్రతినిధులకు గ్రామస్థాయి కార్యక్రమాలకు ప్రోటోకాల్ తప్పనిసరి పాటించాలని రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ అని అన్నారు. ప్రోటోకాల్ విషయంలో ఇప్పటికే వాట్సాప్ ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు చేశామన్నారు. వీటిపై జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు సమ్మర్ కిట్లు పంపిణీ

ఎండల తీవ్రత దృష్ట్యా పని గంటలు తగ్గింపు : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

కానిస్టేబుల్‌కు కిట్ అందజేస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

విజయనగరం ట్రాఫిక్ పోలీసు స్టేషనులో పని చేస్తున్న 80మంది ట్రాఫిక్ పోలీసులకు దాతల సహకారంతో సమకూర్చిన బ్యాగు, టోపీ, వాటర్ బాటిల్ తో కూడిన సమ్మర్ కిట్‌లను జిల్లా లెస్‌పి వకుల్ జిందల్ ట్రాఫిక్ పోలీసు స్టేషనులో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ వేసవి కాలంలో మండు టెండలో ట్రాఫిక్ విధులు నిర్వహించడం చాలా కష్టంతో కూడుకున్నదన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, వేసవిలో ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసుల పని గంటలను తగ్గించడంతోపాటు, కొన్ని పాయింట్లను రద్దు చేసామన్నారు. యూనిఫామ్ ధరించి, విధులు నిర్వహించే పోలీసుల పని తీరును ప్రజలు ఎప్పుడు గమనిస్తుంటారన్నారు. విధులు నిర్వహించే సమయంలో పోలీసు సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని, చక్కని పని తీరుతో పోలీసు వ్యవస్థకు మంచి పేరు తీసుకొని రావాలని పోలీసు సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో విజయనగరం డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, ఎస్‌బి సిఐ ఎవి లీలారావు, ట్రాఫిక్ సిఐ సూరి నాయుడు, ట్రాఫిక్ ఎస్‌ఐలు శంబంగి రవి, ఎస్.భాస్కరరావు, ట్రాఫిక్ పోలీసు స్టేషనులో పని చేసే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమ, సేవా రంగాల్లో వృద్ధికి అవకాశాలు

- వినూత్న ఆలోచనలతో వ్యవసాయాభివృద్ధికి ప్రణాళికలు
- ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటుకు 280 ఎకరాలు కేటాయింపు
- అవగాహన సదస్సులో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నెల్లిమర్ల నియోజకవర్గంలో పరిశ్రమలు, సేవారంగాల్లో అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ డాక్టర్ బిఆర్‌అంబేద్కర్ తెలిపారు. గ్రామాల్లో అందుబాటులో వున్న వనరులు స్థానిక పరిస్థితుల ఆధారంగా ప్రణాళికలు రూపొందించాల్సిన బాధ్యత గ్రామస్థాయిలో పనిచేసే సిబ్బందిపై వుందన్నారు. గ్రామాల్లో స్థానిక పరిస్థితుల ఆధారంగా, అక్కడి వనరులతో వృద్ధి రేటు సాధనకోసం గ్రామస్థాయి ప్రణాళికలను ఈనెలాఖరులోగా రూపొందించాలన్నారు.

నెల్లిమర్ల నియోజకవర్గ అభివృద్ధి విజన్ 2047పై జరజాపుపేటలో నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజల తలసరి ఆదాయం పెరగాలంటే ప్రాథమిక రంగమైన వ్యవసాయ, అనుబంధ రంగాల ద్వారా రైతులకు లభించే ఆదాయం పెంచడం ద్వారా మాత్రమే సాధ్యమని చెప్పారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని ఇచ్చే పంటలపై దృష్టి సారించాలని వ్యవసాయ అధికారులు, సిబ్బందికి సూచించారు. రబీలోనూ సాగు విస్తీర్ణాన్ని పెంచాల్సి ఉందన్నారు. జిల్లాలో వేసవిలోనూ పంటలసాగు కొనసాగించేలా కార్యాచరణ ప్రణాళిక వుండాలన్నారు. జిల్లాలో పరిశ్రమల రంగం ద్వారా ఉపాధి అవకాశాలు పెంచేందుకు 6600 చిన్న పరిశ్రమలను పునరుద్ధరించే ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఒక చిన్న పరిశ్రమల పార్కు ఏర్పాటు చేయబోతున్నామని, దీనికోసం ఇప్పటికే ఏపిఐఐసికి 280 ఎకరాలు కేటాయించామన్నారు.వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడిపరిశ్రమ, కోళ్ల పెంపకం, మత్స్య పరిశ్రమ ఉద్యాన పంటల సాగు ద్వారా కూడా ఆదాయం పెంపొందించుకొనే అవకాశం వుందని, వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. భోగాపురం విమానాశ్రయ నిర్మాణం పూర్తయితే పెద్ద ఎత్తున హోటల్స్ ఏర్పాటై సేవారంగంలో వృద్ధి అవకాశాలు పెరుగుతాయన్నారు. బీచ్ కారిడార్ ఏర్పాటు ద్వారా

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

పరిశ్రమ, సేవారంగాల్లో ఆదాయం పెరిగే అవకాశం వుందన్నారు.

జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో 14,447 ఎకరాల్లో ఈ ఏడాది వ్యవసాయ సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఉద్యాన అధికారి ఎవిఎన్‌వి జమదగ్ని మాట్లాడుతూ నెల్లిమర్లలో 900 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. నియోజకవర్గంలో ప్రస్తుతం 4500 ఎకరాల్లో ప్రకతి సేద్యం జరుగుతోందని, 6500 ఎకరాలకు విస్తీర్ణాన్ని పెంచాలని యోచిస్తున్నట్లు ప్రకృతిసేద్యం డిడి ఆనందరావు చెప్పారు. సూక్ష్మసేద్యం ద్వారా వ్యవసాయోత్పత్తి పెంచవచ్చని ఎపిఎంఐపి పీడీ లక్ష్మీనారాయణ చెప్పారు. పశుపోషణ, కోళ్ల పెంపకం, గొర్రెలు, మేకల పెంపకం ద్వారా అధిక ఆదాయం సాధించేందుకు అవకాశాలు వున్నాయని, రైతుల్లో దీనిపై అవగాహన కలుగ జేయాలని పశు సంవర్ధక శాఖ అధికారి వై.వి.రమణ చెప్పారు. నియోజకవర్గంలోని తహశీల్దార్‌లు, ఎంపిడిఒలు, ఇతర మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. గుర్ల మండలం జమ్ముపేటకు చెందిన కురిమినెల్లి శ్రీనివాస్ అనే రైతు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన బాస్మతి రకాల ధాన్యాన్ని పరిశీలించారు రైతు శ్రీనివాస్, ఆయన సతీమణిని సత్కరించారు.

పట్టాలు ప్రదానం చేస్తున్న మిరాకిల్ సంస్థ చైర్మన్ లోకం ప్రసాద్ తదితరులు

ఘనంగా మిరాకిల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని ముంజేరు మిరాకిల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టభద్రులైన విద్యార్థులకు మిరాకిల్ చైర్మన్ లోకం ప్రసాద్ పట్టాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన జెఎన్‌టియు అకాడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ కెసిబి రావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవిత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. జీవితంలో అన్ని రంగాల్లో రాణించడానికి ప్రయత్నించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ శ్రీనివాసరావు, ఎఒ త్రినాధరావు, ప్రిన్సిపల్ అర్జునరావు, ప్రబంధుకుల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

15 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని పెదమధుపాడ గ్రామంలో శుక్రవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను ఎక్సైజ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. కె.సత్యారావు అనే వ్యక్తి వద్ద 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రమణ తెలిపారు. సత్యారావును విజయనగరంలోని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం

ప్రజాశక్తి-వంగర

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని రాజాం రూరల్ సిఐ హెచ్. ఉపేంద్ర రావు అన్నారు. మండలంలోని మగ్గూరులో ఆయన శనివారం పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు వల్ల బతుకులు నాశనం అవుతాయని అందువల్ల ప్రతి ఒక్కరూ వాటికి దూరంగా ఉండాలని సూచించారు. వంగర ఎస్ఐ షేక్ శంకర్, ఎఎస్ఐ ప్రసాద. సిబ్బంది పాల్గొన్నారు.

పోలియో నిర్మూలనకు నిధుల సేకరణ

ప్రజాశక్తి-బొబ్బిలి

అంతర్జాతీయ రోటరీ సంస్థ ఆదేశాల మేరకు పోలియో నిర్మూలనకు రోటరీ జిల్లా అధ్యక్షులు జెసి రాజు, సింద్రీ శ్రీనసన్, జి. శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో నిధుల సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా జెసి రాజు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పోలియో నిర్మూలనకు గడచిన 52 ఏళ్లనుండి అంతర్జాతీయ రోటరీ సంస్థ అలుపులేని కృషి చేస్తోందన్నారు. కార్యక్రమం వారం రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్, రామకృష్ణ, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాలనలో విఫలం

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన పాలకులు ప్రజా పాలన చేయడంలో విఫలమవు తున్నారని ఇప్టూ జిల్లా అధ్యక్షులు ఎం.గోపాలం, నాయకులు రామ్మూర్తి అన్నారు. మేడే పోస్టర్‌ను శనవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల హక్కులపై జరుగుతున్న దాడిని ప్రజలంతా తిప్పి కొట్టాలని కోరారు. కార్యక్రమంలో పి.లక్ష్మణరావు, తదితరులు ఉన్నారు.

అవిశ్వాసానికి మద్దతిస్తే వేటు తప్పదు : శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపల్ చైర్మన్ పదవిపై పెట్టిన అవిశ్వాస తీర్మానానికి వైసిపి కౌన్సిలర్లు మద్దతు ఇస్తే వేటు తప్పదని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు హెచ్చరించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి గుర్తుపై గెలిచిన కౌన్సిలర్లు స్వార్థం కోసం టిడిపికి మద్దతు ఇచ్చేందుకు సిద్ధం కావడం సిగ్గుచేటన్నారు. అవిశ్వాస తీర్మానానికి వైసిపి విప్ జారీ చేస్తుందని, విప్‌ను ధిక్కరిస్తే కౌన్సిలర్ పదవిని కోల్పోవడం తప్పదని హెచ్చరించారు. తెలిసీ తెలియక చేసిన తప్పులను సరి చేసుకుని టిడిపి శిబిరం నుంచి బయటకు రావాలని కోరారు. అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా హైకోర్టులో కేసు వేశామని, తమకు అనుకూలంగా తీర్పు వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. వైసిపిలో గెలిచిన సుజయకృష్ణ రంగారావు టిడిపిలో చేరి మంత్రి పదవి తీసుకున్నారని ఎద్దేవా చేశారు. రాజులు రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత పార్టీ ఫిరాయింపులు సాధారణమేనని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాల్, తూముల రామ్‌సుధీర్ పాల్గొన్నారు.

ఇవిఎంల గోదాంలో తనిఖీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక ఇవిఎం గోదాంను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ శనివారం తనిఖీ చేశారు. ఇవిఎంల గోదాం షట్టర్లకు వేసిన సీలును, ఇవిఎంల భద్రత కోసం ఏర్పాటు చేసిన సిసిటివి కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. ఇవిఎంల భద్రత విషయంలో అప్రమత్తంగా వుండాలని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. తనిఖీ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, తహశీల్దార్ సుదర్శనరావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ భాస్కరరావు, ఎన్నికల డిటి జగన్నాథం పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్ పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో గల సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్ ను శనివారం సర్వశిక్ష ఎపిసి డాక్టర్ ఎ.రామారావు పరిశీలించారు. స్టాక్ పాయింట్‌కు వచ్చిన నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్‌ను పరిశీలించి వాటి భద్రతకు తగిన ఏర్పాటు చేయాలని సూచించారు. స్టూడెంట్ కిట్ ఐటెం ప్రకారం స్థలం కేటాయించి, విద్యార్థులందరికీ మెటీరియల్ సకాలంలో అందే ఏర్